


www.manavaarthamirror.com

# మన వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం
01 సెప్టెంబర్ 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

## వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు: చంద్రబాబు

3 దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం

నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు

గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ

2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ

నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ముఖ్యమంత్రి



మార్కాపురం: ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు,

(మిగతా 2వ పేజీలో)



మజ్లిస్ నుంచి బహిష్కరణ..

## ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ మిస్సింగ్ కలకలం!

ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ అదృశ్యం

మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలతో తీవ్ర వివాదంలో బేగ్

ఆరోపణలు అవాస్తవం, డీప్‌ఫేక్‌లతో కుట్ర చేస్తున్నారని ఆయన వెల్లడి

ఘటనపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ, బీఆర్ఎస్ డిమాండ్

హైదరాబాద్: ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ అదృశ్యం కావడం హైదరాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఉమ్రా యాత్ర ముగించుకుని శనివారం నగరానికి చేరుకున్న ఆయన, అప్పటి నుంచి కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఇప్పటికే పలు తీవ్రమైన ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకున్న ఆయన అదృశ్యం కావడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. క్రమశిక్షణా చర్యల భాగంగా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి

(మిగతా 2వ పేజీలో)

## భాజపా-కాంగ్రెస్ కార్యాలయాల వద్ద పోటాపోటీ నిరసనలు

నాంపల్లిలో యువజన కాంగ్రెస్ ముట్టడి యత్నం

గేటుకు నల్లరంగు పూసి దిష్టిబొమ్మ దహనం

గాంధీభవన్ వైపు భాజపా యువ మోర్చా కార్యకర్తల దూకుడు

కాంగ్రెస్ జెండా దహనం చేసిన భాజపా శ్రేణులు

ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దాడులు, విధ్వంస రాజకీయాలు సరికాదన్న భాజపా నేతలు



హైదరాబాద్: హైదరాబాద్‌లోని భాజపా, కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయాల వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరస్పరం నిరసనలకు దిగిన ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా ఆందోళనలు నిర్వహించడంతో నాంపల్లి, గన్‌ఫౌండ్రి, ఆబిడ్స్ ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భాజపా రాష్ట్ర కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా.. దీనికి ప్రతిగా భాజపా యువ మోర్చా కార్యకర్తలు గాంధీభవన్ ముట్టడికి యత్నించారు. దీంతో రెండు పార్టీల కార్యాలయాల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేపై భాజపా నేతలు అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, బిహార్‌లో విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ఘటనను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం నాంపల్లిలోని

(మిగతా 2వ పేజీలో)



## యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

యూపీలోని కౌశాంబిలో బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

మృతుల కుటుంబాలకు 2 లక్షలు, క్షతగాత్రులకు 50,000 ఎక్స్‌గ్రేషియా

ఘటనపై సీఎం యోగి దిగ్భ్రాంతి, బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

## ఉత్తరాఖండ్‌కు కొత్త ముప్పు: 219 'వేలాడే' హిమానీనదాలు!

ఉత్తరాఖండ్‌లో 219 'వేలాడే' హిమానీనదాలను గుర్తించిన పరిశోధకులు

వీటిలో మూడో వంతు మంచు అస్థిరంగా ఉందని అధ్యయనంలో వెల్లడి

ఈ గ్లేసియర్లు కూలితే భారీ వరదలు, విపత్తులు సంభవించే ప్రమాదం

వాతావరణ మార్పుల వల్లే ఈ ముప్పు పెరుగుతోందని నిపుణుల ఆందోళన





## అమెరికాతో ఉద్రిక్తతలు భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రత్యేక భేటీ

ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్ తన పలుకుబడిని ఉపయోగించాలని విజ్ఞప్తి

శాంతి స్థాపనకు కృషిని ముమ్మరం చేయాలని నేతల నిర్ణయం

కష్టకాలంలో అండగా నిలిచినందుకు భారత్‌కు ఇరాన్ ధన్యవాదాలు

# రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన



సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన

వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్

ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు

పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

అమరావతి: వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు.



## కృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో అనాధ పాఠశాలలో అల్పాహారం.!

### -మీ పుట్టినరోజు వేడుకలో నిరుపేదల కు...ఒక్క పూట ఆకలి తీర్చాలి - డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్



వనస్థలిపురం మన వార్త మిర్రర్ ప్రతినిధి

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాధ పాఠశాలలో ఉదయం అల్పాహార కార్యక్రమాన్ని పంకజ్ భూత్డా గారి జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పిల్లలు ఉదయం అల్పాహారాన్ని ఆస్వాదించి, పంకజ్ భూత్డా వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమంలో సమితి సభ్యులు, అధికారులు అందరూ పాల్గొని పంకజ్ భూత్డా గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ మీ పుట్టినరోజు నిరుపేదల కు ఒక్క పూట ఆహారాన్ని అందించాలని తెలిపారు. మా సమితిని సంప్రదించి అనాధలకు నిరుపేద పిల్లలకు చేయూతనివ్వాలని తెలిపారు







## పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఘన సన్మానం

### -విధి నిర్వహణలో శాంతి భద్రతల పర్యవేక్షణలో వారు అందించిన సేవలు అభినందనీయం.!

యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి పోలీస్ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఘన సన్మానం

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ రామకృష్ణ రెడ్డి మరియు ఏఎస్ఐ వీరేశం పదవీ విరమణ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో వారు అందించిన సుదీర్ఘ సేవలను, విధి నిర్వహణలో ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నిబద్ధత మరియు ప్రజాసేవా దృక్పథాన్ని అభినందించారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో వారు అందించిన సేవలు పోలీస్ శాఖకు విలువైనవని, వారి అనుభవం మరియు సేవా స్ఫూర్తి యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు.

సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు, ప్రజలకు అంకితభావంతో సేవలందించినందుకు ఎస్ఐ రామకృష్ణ రెడ్డి, ఏఎస్ఐ వీరేశంలకు జిల్లా పోలీస్ శాఖ తరఫున ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

విరమణ అనంతరం వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన మరియు సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

పదవికి విరామం మాత్రమే. సేవా స్ఫూర్తికి కాదు.

వారి సేవా వారసత్వం పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుంది.

# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ఈ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి పీఎంఓ స్పందించి జలవనరుల శాఖకు లేఖ పంపడం తదితర విషయాల గురించి పాటిల్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి గతంలోనే ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 152 మీటర్ల వరకు ఎత్తుతో బరాజ్ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం చేసిందని, ఆ అధ్యయనం ప్రకారం152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని చెప్పారు. ఆ ముంపులోనూ 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని వివరించారు. ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని అన్నారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఎంఓ నుంచి లేఖ అందిందని ముఖ్యమంత్రికి పాటిల్ చెప్పారు. దీనిపై తొలుత కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

**ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

పాలమూరు--రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. బుధవారం పార్లమెంట్ భవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు కేంద్రమంత్రిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని చెప్పారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయి, ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని వివరించారు. ప్రదానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీలను సోషల్ మీడియా వేదికగా దూషించిన ఘటనలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో తమ ప్రభుత్వం పూర్తిగా చట్ట ప్రకారమే ముందుకు వెళ్తోందన్నారు. సోషల్ మీడియాలో ప్రధానిని, ఆయన తల్లిని దూషిస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్త చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసు అధికారిని బదిలీ చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ తర్వాత సీఎం మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు.

**పనీపాటా లేనోళ్లు విమర్శలు చేస్తున్నారు..**

వచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేశారని రేవంత్ చెప్పారు. 'ప్రధానిపై, ఆయన తల్లిపై అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేసిన కేసుకు సంబంధించి డీఎస్పీ బదిలీ వ్యవహారంపై ఢిల్లీలో పనీపాటా లేని కొందరు విమర్శలు చేస్తున్నారు..'అని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారుల బదిలీ అనేది ముఖ్యమంత్రికి రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారమని, తన బాధ్యతల్లో అది కూడా ఒకటని పేర్కొన్నారు. బీజేపీ నేతలే వేరేవాళ్లను దారుణంగా తిడుతున్నారని, కాంగ్రెస్ నేతలను, ప్రతిపక్ష పార?టల నాయకులను, విద్యార్థులను అభ్యంతరకరమైన పదాలతో దూషిస్తున్నారని మండిపడ్డారు.

# రష్యా దాడుల్లో కీవ్ కకావికలం

(మొదటి పేజీ తరువాయి)

ఉక్రెయిన్ ప్రభుత్వం వెల్లడించింది. దాడుల్లో 44 మంది గాయాలపాలయ్యారని కీవ్ రీజియన్ సైనిక విభాగ సారథి తైమూర్ టకచెంకో తెలిపారు. ఈ దాడుల పాపం పరోక్షంగా యూరప్ మిత్రదేశాలదేనని ఉక్రెయిన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. సమయానికి ఇంటర్‌సెప్టార్ మిస్సైళ్ల వంటి గగనతల రక్షణ వ్యవస్థలను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ స్థాయిలో ప్రాణనష్టం జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అసహనం వ్యక్తంచేశారు. శత్రుదేశ క్షిపణులను గాల్లోనే అడ్డగించే పేట్రియాట్ క్షిపణుల తయారీ సాంకేతికతను ఉక్రెయిన్‌కు ఇస్తామని హామీ ఇచ్చి తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట మార్చిన కొద్దిరోజులకే ఉక్రెయిన్‌పై ఇలా క్షిపణుల వాన కురవడం గమనార్హం. 24 బాలిస్టిక్ క్షిపణులు, మరో నాలుగు హైపర్‌సోనిక్ జిర్కోన్/సూపర్‌సోనిక్ ఓనిక్ క్రూజ్ క్షిపణులు, 115 డ్రోన్లను రష్యా ప్రయోగించింది. రష్యన్ కామకాజీ(ఆత్మాహుతి) డ్రోన్లుగా పేరుగాంచిన ఉపియర్ డ్రోన్లను తయారుచేసే ఉరాల్‌డ్రోన్ ప్లాంట్ సీఈఓ వ్లాదిమిర్ టకచుక్ కారు పేలుడులో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం స్వెర్డ్‌లోవోస్క్ రీజియన్‌లోని సంస్థ తయారీ కర్మాగారం వద్ద కారు పేలుడు సంభవించింది. దీంతో అందులోని వ్లాదిమిర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. కారు పేలుడుకు కారకులెవరనేది ఇంకా తెలియాల్సి ఉంది.

# నిరసనల్లో పాల్గొనే యువత పట్ల సహనంతో వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

# బెదిరింపులకు భయపడేది లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. "ఈ యువత, వీరిలాంటి వేలాది మంది భారతీయ యువకులు చేసిన దానికి నేను గర్వపడుతున్నాను. వారు రాజ్యాంగాన్ని, భారత దేశ స్ఫూర్తిని, దేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలిపోతున్న పనికిమాలిన వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పడం నేరం కాదు. వారు తమ ప్రజాస్వామ్య హక్కును మాత్రమే వినియోగించుకున్నారు" అని అన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో 15 ఏళ్ల బాలిక ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత కేసు నమోదు కావడంతో ఆమె సోషల్ మీడియాలో క్షమాపణ చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. బాలికను భయపెట్టి, బలవంతంగా క్షమాపణ చెప్పించారని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ.. విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు. "విద్యార్థులు శాంతియుతంగా, ఎటువంటి దూకుడు లేకుండా నిరసన తెలిపారు. అయినా వారిని కొట్టారు, వేధించారు, బెదిరించారు. ఇప్పుడు వారి ఇళ్ల వద్దకు గూండాలను పంపి, క్షమాపణ చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది పూర్తిగా అర్థరహితమైన చర్య. మేము దీనిని అంగీకరించం" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి, విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెరుగైన విద్యా వ్యవస్థ, పరీక్షా పత్రాల లీకేజీలకు ముగింపు, యువతకు సురక్షితమైన భవిష్యత్తు కావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

# దిగొచ్చిన మెటా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# మళ్లీ మీరొస్తేనే మా బతుకులు మారేది

(మొదటి పేజీ తరువాయి)

'ఈ పాలన ఏం బాగోలేదన్నా.. మీరొస్తేనే రైతు రాజ్యం వస్తుందన్నా.. మీ హయాం అన్నదాతలకు స్వర్ణ యుగం అన్నా..' అంటూ తమ ఆవేదన చెప్పుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాతల ఆవేదన వారి మాటల్లోనే.. పొగాకు రైతులు మిమ్మల్ని అమరావతిలో కలిశాక.. మీరు దేవరపల్లి వస్తున్నారని తెలుసుకుని చంద్రబాబు ప్రభుత్వం కిలోకు రూ.10 మద్దతు ధర పెంచింది. అయితే గ్రేడింగ్ పేరిట వ్యాపారులు ఆ మేరకు అంటే రూ.10 తగ్గించేశారు. ఈ ప్రభుత్వ మాయాజాలం ఇలా ఉంటోంది. ప్రస్తుతం కిలో రూ.170 నుంచి రూ.260 మధ్య కొనుగోలు చేస్తున్నారు. యావరేజ్ ధర రూ.230 కూడా రావడం లేదు. ఎకరాకు రూ.3 లక్షలపైనే ఖర్చవుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యమైన పొగాకును సైతం కిలో రూ.230కే తీసుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో సిండికేట్ వ్యాపారులకే మేలు జరుగుతోంది. సామాన్య రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. అన్నా.. మన ప్రభుత్వంలో దేవరపల్లి బోర్డు పరిధిలో కిలో పొగాకుకు గరిష్టంగా రూ.385 దక్కింది. యావరేజ్‌గా రూ.365 దక్కేది. ఇప్పుడా పరిస్థితి లేనే లేదు. గ్రేడింగ్ పేరుతో వ్యాపారులు సిండికేట్‌గా మారి దోచేసుకుంటున్నారు. కిలోకు ఒక్కోసారి రూ.170 కూడా దక్కడం లేదు. గరిష్టంగా రూ.260 దాటడం లేదు. 20 ఎకరాల్లో పంట సాగు చేశాను. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాను. మీరు దేవరపల్లి పర్యటనకు వస్తున్నారని చంద్రబాబు హడావిడిగా రూ.50 వేలు రుణం వడ్డీ లేకుండా ఇస్తానని ప్రకటించాడు. ఆ రూ.50 వేలు మూడేళ్లలో ఇస్తారంట. మన ప్రభుత్వంలో ఏడాదికి రూ.లక్ష వడ్డీ లేకుండా రుణాలిచ్చారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తేసింది. రైతులు వ్యవసాయం మానేసేలా చేస్తోంది. కేజీ పొగాకు సాగు చేసేందుకు రూ.300 ఖర్చవుతుంటే... ఇక్కడ యావరేజ్‌గా రూ.230కే కొంటున్నారు. లో గ్రేడ్ పేరుతో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారు.

# గొల్లగూడెం కు బీటీ రోడ్డు మంజూరు చేయాలి

### ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 31,( వార్త మిర్రర్) మండలలోని వావిల్ల పెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామా బిటీ రోడ్డు కు నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆ గ్రామ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాదు లోని ఎమ్మెల్యే నివాసంలో రాజగోపాల్ రెడ్డిని కలిశారు .సుమారు 15 సంవత్సరాల క్రితం గొల్లగూడెం కు మెటల్ రోడ్డు వేశారని అది పూర్తిగా దెబ్బతిని పోయిందని.. గుంతలుగా ఏర్పడి రాకపోకలకు చాలా ఇబ్బంది అవుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. వర్షాకాలంలో గ్రామ ప్రజలు విద్యార్థులు వృద్ధులు అత్యవసర సేవలకు రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా ప్రమాదకరంగా మారుతుందని చెప్పారు. ప్రజల ఇబ్బంది దృష్టిలో పెట్టుకొని రాధా నగర్ తండా వెళ్లే బిటి రోడ్డు నుండి గొల్లగూడెంగ్రామ రోడ్డుకు నిధులు మంజూరు చేసి బీటీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. తొందర్లోనే రోడ్డు కు నిధులు మంజూరు చేయించి గొల్లగూడెం కు రోడ్డు వేయిస్తా నని రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు .. నారాయణపురం మండలం తో పాటు నియోజకవర్గంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తానని ఇప్పటికే నియోజకవర్గంలో ప్రతి రోడ్డు బీటీ రోడ్డు ఉండే విధంగా ప్రయత్నం చేస్తున్నానని దాదాపు మెజార్టీ రోడ్లు కు నిధు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లోనే రోడ్ల పనుల నిర్మాణాలను ప్రారంభిస్తామని మిగిలిన రోడ్ల కూడా తొందరలోనే మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర



నాయకులు జక్కలి ఐలయ్యయాదవ్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ వంగూరి సత్తయ్య యాదవ్, కత్తుల లక్ష్మయ్య జ, వంగూరి వెంకటేశ్ యాదవ్, వార్డు సభ్యులు వంగూరి శ్రీనివాస్ యాదవ్, వంగూరి జంగయ్య యాదవ్, యాదయ్య యాదవ్, లింగస్వామి యాదవ్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం యాదవ్, విష్ణు యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## గృహప్రవేశానికి హాజరైన బిజెపి నాయకులు

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 31, ( వార్త మిర్రర్ ): నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు బద్దం యాదయ్య నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్న బిజెపి నాయకులు పాల్గొన్న నాయకులు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్. యాదవ్ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర నరసింహ గౌడ్. వంగరి రఘుపతి. బిజెపి జిల్లా కౌన్సిల్ నెంబర్ వెంకటాచారి. సీనియర్ నాయకులు జక్కర్తి బిక్షం తదితరులు పాల్గొన్నారు

# కల్వకుర్తిలో నేడు బోనాల జాతర.. పోలీసుల ఆంక్షలు

### - ఎస్సై కురుమూర్తి



కల్వకుర్తి ఆగస్టు 31 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలో రేపు జరగనున్న బోనాల పండుగను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా సోమవారం కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో బోనాల నిర్వాహకులు, యువకులతో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ భీమ్ కుమార్, ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ..బోనాల పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. బోనాల ఊరేగింపుల పేరుతో ప్రధాన రహదారులను బ్లాక్ చేసి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని హెచ్చరించారు. బోనాల ఊరేగింపుల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసినా, ఇతర మార్గాల్లో శబ్ద కాలుష్యానికి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిధంగా బోనాలు, ఘట్టాలు, ఊరేగింపులను నిర్ణీత సమయాల్లోనే పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా గొడవలు, ఘర్షణలు చోటుచేసుకుంటే వాటికి నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## జాంబవ కుల సంఘశీ నూతన అధ్యక్షులు గా వడ్డేపల్లి రాములు

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 31,( వార్త మిర్రర్):

నారాయణపురంమండల కేంద్రంలోని గుండ్ల మిట్ట కాలనీ. జాంబవ కుల సంఘశీ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా గతంలో కులసంఘం.చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా తిరిగి పూర్వ వైభోగం తీసుకొస్తామని, నూతన కమిటీ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అనంతరం మన కులస్తుల మేలు కోసం ప్రయత్నం చేస్తూ రాబోయే రోజులలో మరింత అభివృద్ధి పరిచే విధంగా కొనసాగిస్తామని తెలియజేశారు. అనంతరం కుల సంఘశీ ఎన్నికల ద్వారా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది .

అధ్యక్షులు. వడ్డేపల్లి రాములు. ఉపాధ్యక్షులు. చెరుకుపల్లి భాస్కర్ .

ప్రధాన కార్యదర్శి జనగాం రాజు.

కోశాధికారి . చెరుకుపల్లి చిన్న కృష్ణ.

సహాయ కార్యదర్శి, రేవనపల్లి యాదగిరి.

కార్యవర్గ సభ్యులు, చెరుకుపల్లి శంకర్ . సంఘం అంజయ్య . వడేపల్లి, వంశీ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం లో కుల పెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.

# 10వేల ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి కృషి చేస్తా...!

### ..రాజకీయాల కతీతంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు

### ..ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 31

నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు జగిత్యాల నియోజకవర్గానికి 10వేల ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ పట్టణానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు తాటిపాముల మంజూష రాజశేఖర్, మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన కండ్ల పెల్లి భీమరాజు నర్సయ్య, రామజీపేట గ్రామానికి చెందిన సుర మౌనిక విజయ్, కమిరె లక్ష్మి రాజం, ఇటిక్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల కిష్టమ్మ-లక్ష్మయ్య లకు చెందిన ఇందిరమ్మ గృహప్రవేశాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి కానుకలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూనియోజకవర్గానికి మొదటి విడత 3500, 2వ విడత 2 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పండగ వాతావరణం నెలకొందన్నారు. జగిత్యాల పట్టణానికి 4500 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు చేసిన కేసీఆర్ కు అదేవిదంగా మౌలిక సదుపాయాలు కల్పన కోసం 36 కోట్లు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి లకు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్న అన్నారు. రేవు దాటాక తెప్ప తగిలేసే రకం కాదు నేను అని జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి సంక్షేమ రెండు చేకూర్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఒక్కో గ్రామానికి 20 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా దాదాపు 1 కోటి రూపాయల నిధులు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ అయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఇండ్ల మంజూరు చేయలేక పోయామని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొంత స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు 5 లక్షల రూపాయలతో సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఈ



కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచులు వనిత రమేష్, మోహన్, ఆకుల అంజయ్య గౌడ్, మల్లేశం, బోదాసు చంద్రశేఖర్, నీరటి శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, రాయికల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం రాజేందర్, నాయకులు కోల శ్రీనివాస్, తంగెళ్ల రమేష్, జోగినిపెల్లి తిరుపతి గౌడ్, అచ్యుత్ రావు, గన్నే రాజారెడ్డి, మహేందర్ బాబు, మచ్చ శేఖర్, మురళి, రాజేష్, ముఖీద్, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, సామల్ల వేణు, జలెందర్, గుజ్జుల మోహన్ రెడ్డి, భూమేష్, పడిగేల నర్సింహా, అంబాల రాము, తదితరులు పాల్గొన్నారు.




## సబ్సిడీ విత్తనాలతో రైతులకు భరోసా

కల్వకుర్తి ఆగస్టు 31, వార్త మిర్రర్ ప్రతినిధి:- రైతులకు అండగా నిలుస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. ఆమనగల్ పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఆమనగల్, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన రైతులకు వేరుశనగ విత్తనాలను వివిధ మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి విత్తనాల పంపిణీ, సాగు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలను అర్హులైన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యమైన విత్తనాలతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేపడితే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు.వేరుశనగ సాగుకు అనుకూలమైన సమయంలో ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే ప్లాస్టిక్ తయారీ వినియోగం మొదలైంది

### రాహుల్ వ్యాఖ్యలు పిచ్చోడి చేతిలో రాయి లాంటివి

### బిజెపి నాయకులు నలువాల తిరుపతి, మర్రిపెల్లి సత్యమ్.



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 31

బిజెపి పార్టీ దళితుల వ్యతిరేక పార్టీ అని దళితుల కోసమే భారత దేశంలో ప్లాస్టిక్ కప్పులు గ్లాసులు తయారు చేశారని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. 1957 వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే భారతదేశంలో ప్లాస్టిక్ తయారీ వినియోగం మొదలైందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అంటరానితనం అంటే ఏంటో చూపించారని గరీబీ హటావో నినాదం పేరుతో ఈ దేశంలోని దళిత, తాడిత, పీడిత బడుగు బలహీన వర్గాల జాతులను ఊరి బయట ఉండేలా నివాసాలు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నది రాహుల్ గాంధీ తెలుసుకోవాలని అన్నారు. భారతీయ జనతా పార్టీ అంటేనే దళితుల పార్టీ అని భారతదేశం లోనే అత్యధిక శాసనసభ్యులు కలిగిన పార్టీ బిజెపి అని అంతేకాకుండా కేంద్రంలో బిజెపి పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వచ్చిన ప్రతిసారి ఒక మైనార్టీ వ్యక్తి అయినా అబ్దుల్ కలాం ని చర్మకారి వృత్తి చేసుకునే దళితుడైనా రామ్నాథ్ కోవింద్ ని మూడవసారి తేయాకు తోటల్లో కూలి పని చేసుకునే ఒక గిరిజన ఆడబిడ్డను ఈ దేశ ప్రథమ పౌరులను చేసిన ఘనత భారతీయ జనతా పార్టీ దేనని రాహుల్ గాంధీ తెలుసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి దళితుడైన మల్లికార్జున ఖర్గేను జాతీయ అధ్యక్షుడిని చేయకంటే 20 సంవత్సరాల ముందే భారతీయ జనతా పార్టీకి దళితుడైన బంగారు లక్ష్మణ్ ని జాతీయ అధ్యక్షున్ని చేసిన ఘనత బిజెపి దేనని అన్నారు. నెహ్రూ ప్రభుత్వ హాయంలో దళితుడైన అంబేద్కర్ ని అడుగడుగున అవమానపరిచి కాంగ్రెస్ పార్టీ నుండి పొమ్మనలేక పొగపెడితే అప్పటి భారతీయ జన సంఘ్ పార్టీ అక్కున చేర్చుకుని గౌరవించినదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కి భారతరత్న ప్రకటించి ఇవ్వకుండ అవమానిస్తే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక భారతరత్న ప్రధానం చేసిన విషయం రాహుల్ గాంధీ గుర్తెరగాలని అన్నారు. అంతేగాకుండా బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయ్యాకనే భారత పార్లమెంట్ సెంట్రల్ హాల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి అంబేద్కర్ యొక్క జన్మదినాన్ని ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి చేత ఆమోదింపజేసిన ఘనత బిజెపి దేనని అన్నారు. అంబేద్కర్ జీవితంలోని అరుదైన ఐదు ప్రదేశాలను పంచ తీర్థాలుగా అభివృద్ధి చేసి పర్యాట కేంద్రాలుగా తీర్చిదిద్ది అంబెడ్కర్ కి అరుదైన గౌరవం ఇచ్చింది కేవలం బిజెపి మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దళిత వ్యతిరేక పార్టీ అని అందుకే అంబెడ్కర్ ని అడుగున వంచించి అవమానించి పార్లమెంటు సభ్యునిగా పోటీ చేసిన రెండుసార్లు అంబెడ్కర్ ని ఓడించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఇండికూటమిలో భాగస్వామ్య పార్టీ అయినా బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి కుమారి మాయావతి చేసిన వ్యాఖ్యలు రాహుల్ గాంధీకి దళితులు అంటే గిట్టదని దళిత వాడల్లో పర్యటన అనంతరం మలినం అంటుకుంటుందనే ఉద్దేశంతో ప్రత్యేకమైన సబ్బుతో స్నానం చేసేవారని చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం అని ఎద్దేవా చేశారు. కేవలం ఒకసారి వాడుకొని పడేసే ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని 2022 లో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిషేధించిన విషయం ఒక ప్రతిపక్ష పార్టీ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న రాహుల్ గాంధీకి తెలియకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి జంబర్తి దివాకర్, కోశాధికారి సుంకేటి దశరథ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రాగిళ్ల సత్యనారాయణ, రూరల్ మండలం అధ్యక్షుడు ఇట్నేని రమేశ్, గర్వందుల రమేష్, తదితరులు పాల్గొన్నారు..



## శంకర్‌పల్లిలో జిల్లా క్రికెట్ సెలక్షన్స్ కు 34 మంది విద్యార్థులు ఎంపిక

వార్త మిర్రర్ ఆగస్టు 31 శంకర్‌పల్లి: జోన్ లెవెల్ క్రికెట్ సెలక్షన్ కార్యక్రమం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపూర్ వార్డులో గల బిపిఆర్ క్రికెట్ గ్రౌండ్ లో నిర్వహించారు. ఈ క్రికెట్ సెలక్షన్స్ లో 300 మంది విద్యార్థులు పాల్గొనగా 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని తదుపరి జిల్లా స్థాయికి పంపిస్తామని జోనల్ సెక్రెటరీ అరుంధతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీందర్‌రావు, క్రికెట్ గ్రౌండ్ దాత పాపి రెడ్డి, అన్నదాత రాజేష్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, బీడీలు బసవరాజు, మల్లేష్, ప్రవీణ్, ప్రభాకర్, మహారాజుపేట హెచ్ఎం చిన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడి రాజీనామా

సికింద్రాబాద్, ఆగస్టు 31:

అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏడల గణేష్ తన పదవికి రాజీనామా చేశారు. గత రెండేళ్లుగా సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన.. తన పదవీకాలం ముగియడంతో ఆగస్టు 30న కమిటీ సభ్యులు, సంఘ సభ్యుల సమక్షంలో అధ్యక్ష పదవితో పాటు కమిటీ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.సంఘం అభివృద్ధికి సహకరించిన కమిటీ సభ్యులు, సంఘ సభ్యులకు ఈ సందర్భంగా గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 09న వరంగల్ లో ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయి శిక్షణ తరగతులు - విజయవంతం చేయాలి... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ....

కొండాపూర్ వార్త మిర్రర్ : సెప్టెంబర్ 09న వరంగల్ లో జాతీయ స్థాయిలో జరిగే ఎమ్మార్పీఎస్ మండల కమిటీల శిక్షణ తరగతుల సభను విజయవంతం చేయాలని, నూతన కమిటీల నిర్మాణం చేపట్టాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.ఈ మేరకు హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఐత రమేష్ మాదిగ, కొండాపూర్ అధ్యక్షులు జగపతి అంజయ్య మాదిగ, శేరిలింగంపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సింగదాసరి నరేష్ మాదిగ, సింగదాసరి రాజు మాదిగ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## తెలుగు హిందీ లను అవమానిస్తే తెలంగాణ తల్లి, భారతమాతను అగౌరవపరచినట్లే...!

### ఆర్యుపిపిటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ పక్షాన జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్...



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 31కొందరు భాషేతర ఉపాధ్యాయులు తెలుగు, హిందీ భాషల పాఠ్యపుస్తకాలను, ఫేర్ నోట్స్ ను ఉద్దేశ్యపూర్వకంగా చింపివేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసిందని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ఆవేదన వ్యక్తం చేసారు. తల్లి భాషైన తెలుగు తెలంగాణ తల్లితో సమానమని, జాతీయ భాషైన హిందీ భారతమాతతో సమానమని మా సంఘం భావిస్తుందని ఈ నేపథ్యంలో తెలుగు హిందీలను అవమానపరిస్తే తెలంగాణ తల్లిని, భారతమాతను అవమానపరచినట్లు మా సంఘం భావిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, ఎవరైనా కులమతాలకు అతీతంగా మాతా పృథ్వి పుత్రోహం పృథివ్యాహ అనగా ఈ భూమి నాతల్లి నేను ఈమె పుత్రుండను అనే భావనతో మాతృభూమి పట్ల, దేశభక్తితో కూడిన గౌరవ భావనతో ద్వేష భావాలు లేకుండా భారతమాత ముద్దుబిడ్డలుగా సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని, స్వీయ అరాధన సర్వ ఆదరణ అన్నట్లు ఎవరి సబ్జెక్టులపై వారు ఆరాధన భావం, ఇతర సబ్జెక్ట్ లపై ఆదరణ భావం కలిగివుండాలని అన్నారు. కర్మ, కాలం శక్తివంతమైనవని వాటి నుండి ఎవరు తప్పించుకోలేరని, సాధ్యమైనంత వరకు ధర్మబద్ధంగా, సత్యమార్గంలో పయనించే ప్రయత్నం చేయాలని అన్నారు.



## ధ్రువపత్రాల పరిశీలన కానివారు చేయించుకోవాలి ఐసిడిఎస్ ప్రాజెక్టు సి డీ పీ ఓ జయప్రద

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 31

జగిత్యాల ఐ సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి టీచర్లకు దరఖాస్తు చేసుకున్న వారి నుండి ఆ యొక్క ధ్రువపత్రముల పరిశీలన కార్యక్రమము తేదీ 27.08.2026 నుండి దరఖాస్తు దారుల నుండి వారి యొక్క ధ్రువపత్రముల పరిశీలన కొనసాగుతున్నది. రాయికల్ మండలంలో 175 దరఖాస్తులు ఆన్లైన్ చేసుకోగా, సోమవారం రోజు 31-08-2026 వరకు రాయికల్ మున్సిపాలిటీ లో 77 దరఖాస్తులకు 17 రాయికల్ మండలం రూరల్ లో 68 దరఖాస్తులకు 25 మాత్రమే ధృవపత్రంల పరిశీలన జరిగినది. మిగిలిన 133 దరఖాస్తుదారుల ధ్రువపత్రంల పరిశీలన చేయించుకోవాలని ప్రాజెక్టు సి డీ పీ ఓ జయప్రద ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది.

# కల్వకుర్తి విద్యానగర్ లో చోరి

### - అర్ధరాత్రి ఇంట్లోకి దూరి సెల్ ఫోన్ తస్కరణ
### - గోడదూకి పారిపోయిన దొంగ
### - సీసీ కెమెరాలో రికార్డు




కల్వకుర్తి ఆగస్టు 31 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తిలో దొంగతనాల పరంపర కొనసాగుతుంది. దొంగలు ఎప్పుడు ఎవరి బైకు దొంగతనం చేశారో, ఎవరి సెల్ ఫోన్ కొట్టేస్తారో.. నని పలు పనుల నిమిత్తం కల్వకుర్తికి వచ్చే ప్రజలు బయందోళనలకు గురవుతున్నారు. గతంలో విద్యానగర్ లోని యుటిఎఫ్ బిల్డింగ్ సమీపంలో ఉన్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్కు చేస్తే పట్టపగలు మూడు గంటలకు వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు తస్కరించారు. ఇది ఇలా ఉంటే నెల క్రితం పోస్ట్ ఆఫీస్ కార్యాలయం పక్కన ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి మళ్లీ వచ్చి చూసేసరికి వాహనం మాయమైంది. తాజాగా సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగ విద్యానగర్ మార్కెట్ యార్డ్ సమీపంలోని ప్రముఖ న్యాయవాది ఇంట్లో అర్ధరాత్రి చోరబడి సెల్ ఫోన్ ను తస్కరించారు. ఇలా మార్కెట్లో ఆదివారం కొందరు దొంగలు సెల్ ఫోన్లు చాకచక్యంగా కొట్టేసి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో మార్కెట్ కు వచ్చే వినియోగదారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు ఇంత గస్తీ ఏర్పాటు చేసిన కానీ దొంగలు వారి కళ్ళు కప్పి తన పని తాను చేసుకునిపోవడం కొసమెరుపు. ఇప్పటికైనా పోలీసులు దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించి, బాధితులకు వారి వాహనాలు సెల్ ఫోన్ లను అప్పగించాలని ఫిర్యాదారులు కోరుతున్నారు. ఇది ఇలా ఉంటే న్యాయవాది ఇంట్లో సెల్ఫోన్ చోరీ అయిందని ఫిర్యాదు చేసిన , ఇప్పటి వరకు సంఘటన స్థలానికి ఒక హోంగార్డు కూడా చేరుకోకపోవడం గమనార్హం. ఒక న్యాయవాది ఫిర్యాదు చేస్తేనే పట్టించుకోవడం లేదంటే , సామాన్య ప్రజలు ఫిర్యాదు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదంటూ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి, దొంగతనాలకు కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 31

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన పడిగేల నరసింహ--సునీత దంపతుల కుమారుడు/కుమార్తె వివాహం ఇటీవల జరగడంతో, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన వధూవరులకు పెళ్లి కానుకగా చీరను అందజేసి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. నూతన దంపతులు సంతోషకరమైన, ఆనందమయమైన జీవితాన్ని గడపాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి మోఖీద్, రాయికల్ పట్టణ అధ్యక్షుడు వాసం రాజేందర్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, కో-ఆప్షన్ సభ్యుడు ఇర్ఫాన్, మురళి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంద్ర రమాదేవి--అచ్యుత్ రావు, మచ్చ శేఖర్, గన్నె రాజారెడ్డి, గుజ్జుల మోహన్ రెడ్డి, మహేందర్ బాబు, తిరుపతి గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే యువజన నాయకులు కటకం సాయి, కొత్తపెల్లి అరవింద్, ఇప్ప శ్రీకాంత్, అభి, సంజీవ్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# హరిత నిర్మాణాలే భవిష్యత్తుకు బాట...

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క...






శేరిలింగంపల్లి:వార్త మిర్రర్ : పర్యావరణ హిత నిర్మాణాలను ప్రోత్సహించడంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ ) కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.ఐజీబీసీ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.2003లో కేవలం 20 వేల చదరపు అడుగులతో ఒక్క భవనంతో మొదలైన ఐజీబీసీ ప్రస్థానం నేడు 20 వేలకు పైగా ప్రాజెక్టులు, 16.33 బిలియన్ చదరపు అడుగులకు విస్తరించడం గర్వకారణమన్నారు. గ్రీన్ బిల్డింగ్స్ వల్ల విద్యుత్ వినియోగం 50%, నీటి వినియోగం 40% తగ్గుతుందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి కట్టుబడి ఉందని, పునరుత్పాదక ఇంధనం, హరిత భవనాలను ప్రోత్సహిస్తామని భట్టి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో హరిత నిర్మాణమే సాధారణ నిర్మాణంగా మారాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సిఐఐ ప్రెసిడెంట్ డిజిగ్నేట్ డా. సుచిత్రా ఎల్లా, గోద్రేజ్ గ్రూప్ చైర్మన్ జమ్షెద్ గోద్రేజ్, ఇజీబీసీ నేషనల్ చైర్మన్ సి. శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎ.ఆర్. ఉన్నికృష్ణన్ పాల్గొన్నారు.

## కీర్తిశేషులు బట్టపోతు రాములు జ్ఞాపకార్థంగా సామజిక సేవా కార్యక్రమాలు...



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 31

చౌటుప్పల్ మండలం దామెర గ్రామం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు బట్టపోతు రాములు 6వ,వర్ధంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని గ్రామ సర్పంచ్ సాతిరి శ్రీధర్ అన్నారు.కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో గ్రామంలో వాటర్ ప్లాంట్ కు మరమ్మత్తులు చేయించి గ్రామ ప్రజలకు 200 వాటర్ క్యాన్ లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్ మాట్లాడుతూ బట్టపోతు రాములు జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారని, వృద్దులకు చేతి కర్రలు అందజేశారు.అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పునూతల నరసింహ,కుటుంబ సభ్యులు బట్ట పోతు కరుణ,విజయ్,విక్రం,వరుణ్, బట్ట పోతు బిక్షం, సరిపల్లి మంజుల, పెరుమాళ్ళ అరవిందు, ఐతగోని నరసింహ సాతిరి మధు, ఊడగు యాదయ్య, సాతిరి ధనరాజు, బట్ట పోతు సత్తయ్య, ఊడగు రాఘవేంద్ర,ఏన్నం శ్రీనివాస. బియ్య సత్యనారాయణ, సాతిరి రాజు సాతిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు..

## గుండ్లమెట్ట జాంబవ కుల సంఘం అధ్యక్షులుగా- వడ్డేపల్లి రాములు ఏకగ్రీవ ఎన్నిక

### నా సామాజిక వర్గం అభివృద్ధి చెందేలా కృషి చేస్తా- వడ్డేపల్లి రాములు

యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గుండ్లమెట్ట జాంబవ కుల సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం గౌరవ అధ్యక్షుల చేతుల మీదుగా, సుక్క రాములు, పొట్ట పెద వెంకటేష్ ఆధ్వర్యంలో మరియు కుల సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఓటింగ్ విధానం ద్వారా వడ్డేపల్లి రాములు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులకు కుల సంఘ నాయకులు, సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అధ్యక్షుడుగా వడ్డేపల్లి రాములు,ఉపాధ్యక్షుడు చెరుకుపల్లి భాస్కర్,ప్రధాన కార్యదర్శి జనగాం రాజు,కోశాధికారి చెరుకుపల్లి కృష్ణ,సహాయ కార్యదర్శి రేవనపల్లి యాదగిరి లను ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.నూతన కమిటీ నేతలు మాట్లాడుతు తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, సంఘాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.





## 40 ఏళ్లుగా అన్నమే మానేసింది..పల్లీలు, బెల్లమే భోజనం..

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 31

ఒక్కపూట అన్నం తినకపోతేనే బేజారవుతాం.. అలాంటిది ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 40 ఏళ్లుగా అన్నం మానేసిన కాజమ్మ పల్లీలు, బెల్లాన్నే ప్రధాన ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన కాజమ్మ (65) జీవితంలో నాలుగు దశాబ్దాలుగా అన్నానికి చోటు లేకుండా పోయింది. కుటుంబ కలహాల కారణంగా అత్తగారింటికి వెళ్లిన సమయంలో ఎదురైన ఘటన కారణంగా అలిగి అన్నం మానేసింది. అయితే అప్పట్లో తక్కువ ధరకు లభించే పల్లీలు, బెల్లం కొనుగోలు చేసి ఆకలి తీర్చుకోవడం ప్రారంభించినట్లు కాజమ్మ తెలిపారు. “అత్తగారింటికి వెళ్లకపోతే అన్నం తినడం మానేయి.. నువ్వు లావుగా ఉన్నావు” అంటూ వదిన వరసయ్యే మహిళ చెప్పిన మాటలతో అలిగిన ఆమె మనస్తాపానికి గురై పల్లీలు, బెల్లంతో ఆహారం మొదలుపెట్టానని వివరించారు. అప్పటి నుంచి అదే అలవాటుగా మారిపోయిందని తెలిపారు. ఎప్పుడైనా అన్నం తినేందుకు ప్రయత్నించారా అని అడిగితే.. అన్నం తనకు అరగదని కాజమ్మ చెబుతున్నారు. తాను పల్లీలు, బెల్లాన్ని కూడా తక్కువ మోతాదులోనే తీసుకుంటానని తెలిపారు. ప్రస్తుతం వయసు పైబడటంతో పళ్లు ఊడిపోవడంతో పల్లీలను మెత్తగా చేసుకుని బెల్లంతో కలిపి తింటున్నట్లు చెప్పారు. ఇంతకాలం ఈ ఆహారంతోనే జీవిస్తున్నప్పటికీ ఇప్పటివరకు తనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని కాజమ్మ చెబుతున్నారు. అయితే వయసు పైబడుతున్న నేపథ్యంలో ఆమె ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి కాజమ్మకు అవసరమైన వైద్య పర్యవేక్షణతో పాటు ఆరోగ్యంగా జీవించేందుకు ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా పల్లీలు.. బెల్లాన్నే భోజనంగా చేసుకున్న కాజమ్మ జీవితం ప్రస్తుతం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.